క్లుప్తంగా

చదరంగంతో విద్యపై ఏకాగ్రత



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: చదరంగంతో విద్యపై ఏకాగ్రత పెరుగుతుందని పలువురు అన్నారు. ద చిల్డ్రన్స్ అసోసియేషన్ అకాడమీ వారం పాటు చదరంగంపై శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించింది. మంగళవారం జరిగిన తుదిపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసింది. నిర్వాహకులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 1999 నుంచి విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొల్లినేని జగన్నాథంనాయుడు, పఠాన్ ఫజురుల్లా ఖాన్, సంస్థ సభ్యులు మాజీ ప్రధానపాధ్యాయులు సురేష్, శ్యామ్‌సుందర్, భక్తవత్సలం, రమేష్, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలకు వైద్య పరికరాలు



వైద్య పరికరాలను అందజేస్తున్న వైద్యాధికారిణి మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి మాధవి ఆధ్వర్యంలో సేవ్ ద చిల్డ్రన్ సంస్థ కో-ఆర్డినేటర్ హేమంత్ మంగళవారం హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల సిబ్బందికి వైద్య పరికరాలను అందజేశారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ, మండలంలోని 14 హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలకు బీపీ ఆపరేటర్, స్టెతస్కోప్, వేయింగ్ మెషిన్, థర్మామీటరు, గ్లూకో మీటరు, ఫుట్‌స్టెప్స్, ఇన్‌ఫ్రారెడ్ థర్మామీటరు, డస్ట్‌బిన్లు, స్టాండ్స్, గ్లూకో స్ట్రిప్స్, నీడిల్ కట్టర్, ఆటో క్లేవ్ మొదలైన వాటిని సేవ్ సంస్థ అందజేసిందని తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, గౌరి, 'సేవ్' సంస్థ సిబ్బంది మునెమ్మ, గీత, మునివేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'గరికపాటి' కుటుంబానికి పరామర్శ



సుధాకర్‌బాబు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విద్యాస్వరూపానందగిరిస్వామి

శ్రీకాళహస్తి: స్థానిక నగరివీధిలో నివాసం ఉంటున్న గరికపాటి సుధాకర్‌బాబు ఈ నెల 3న మధ్యాహ్నం గుండెపోటుతో మరణించాడు. ఇది తెలుసుకున్న శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జీవితం, భగవంతుడు, ఇహలోకం నుంచి పరమాత్ముని చెంతకు చేరడం..ఇత్యాది వాటిపై వారికి ఆధ్యాత్మికబోధనతో స్వాంతన కలిగించారు.

రాజ్యాధికారం అందని ద్రాక్ష



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

శ్రీకాళహస్తి: దేశ జనాభాలో 40శాతం ఉన్న బహుజనులకు రాజ్యాధికారం అందని ద్రాక్షలా మారిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీకాళహస్తిలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని పేర్కొన్నారు. బీఎస్పీని అందరూ ఆదరిస్తే రాజ్యాధికారం సాకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో గుర్రప్ప, ప్రభాకర్, జయచంద్ర, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

ఏర్పేడు: నిత్యం ఏర్పేడులో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు ఆదేశించారు. మంగళవారం ఆయన ఏర్పేడు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఏర్పేడులో ఆరులేన్ల రోడ్డు పనుల మూలాన రోజు ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్యకు సూచించారు.

ఆర్బీకేల వ్యవసాయాభిషేకం

వ్యవసాయం దండగ– అంటూ తెలుగుదేశం ప్రభుత్వం రైతాంగాన్ని అథోగతి పాల్జేస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్ద పీట వేసి, ఆర్బీకేల ఏర్పాటుతో పలు సేవలను వారి ముంగిటకే తెచ్చి, వ్యవసాయాన్ని పండుగ చేసింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు మొదలైనవన్నీ గ్రామస్థాయిలోనే అందుతుండడంతో మట్టినే నమ్ముకున్న తమకు ఫలితం దక్కుతోందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.



సంతవేలూరు సబ్సిడీపై ట్రాక్టర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం (ఫైల్)

- రైతాంగ సంక్షేమానికి ప్రాధాన్యం
- టీడీపీ పాలనలో మొండిచేయి
- వ్యవసాయాన్ని పండుగ చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



మత్తేరిమిట్టలోని రైతు భరోసా కేంద్రం



నెల్లటూరు ఆర్బీకేలో ఎరువులను తీసుకుంటున్న రైతులు

వరదయ్యపాళెం: మండలంలో 29 గ్రామ పంచాయతీలకు సంబంధించి 12 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి అగ్రికల్చర్ అసిస్టెంట్లతో పలు సేవలను అందిస్తోంది. విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, యంత్రాలు మొదలైవన్నీ అందుబాటులో ఉంచుతోంది. రైతులు పండించిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేసి ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు పరిహారం, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం, పొలం బడి ద్వారా రైతులకు శిక్షణ, ట్రోల్ ఫ్రీ నెంబరు 155251 ద్వారా రైతులకు నేరుగా ముఖాముఖితో శాస్త్రవేత్తల సలహాలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు దోహదపడుతున్నాయి. వీటి ద్వారా 5,015 మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు.

వరదయ్యపాళెం మండలంలో ఆర్బీకే సేవలు

మొత్తం రైతు భరోసా కేంద్రాలు	: 12
సిబ్బంది	: 10
మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు	: 12
సేవలు పొందుతున్న రైతులు	: 5015
పంపిణీ చేసిన ఎరువులు	: 312 మెట్రిక్ టన్నులు
పురుగు మందులు	: 150 లీటర్లు
విత్తనాలు	: 800 క్వింటాళ్లు
కస్టమ్ హైరింగ్ కేంద్రాలు	: 12
పంపిణీ చేసిన వైఎస్సార్ యంత్ర సేవ ట్రాక్టర్లు	: 8
పంపిణీ చేసిన కౌలు రైతుల గుర్తింపు కార్డులు	: 121
రైతు భరోసా పీఎం కిసాన్ పథకం కింద అందించిన మొత్తం	: రూ.30.75 కోట్లు
ధాన్యం కొనుగోలు	: 625 మెట్రిక్ టన్నులు
పొలం బడి కార్యక్రమాలు	: 5
రైతు భరోసా సచిత్ర మాస పత్రికలు	: 180 మంది రైతులకు
ఈ-పంట నమోదు	: 10500 ఎకరాలు
సున్నా వడ్డీ పంట రుణాలు	: 1400 మంది రైతులకు
పంట కోత ప్రయోగాల నిర్వహణ	: 80 ప్లాట్లు

ఎంతో సౌకర్యం



రైతు భరోసా కేంద్రాలతో సౌకర్యంగా ఉంది. రైతులకు పంటల సాగు విషయంలో ఎన్నో సూచనలను ఇస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. రైతుల సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.
-రవి, రైతు, చిన్న పాండూరు

అవస్థలు పడే బాధ తప్పింది



గతంలో ఎరువులు తెచ్చుకోవాలంటే వరదయ్యపాళెంకు వెళ్లి ఎన్నో అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో మాకు కావలసినవన్నీ ఇస్తుండడంతో ఎంతో సంతోషంగా ఉంది. శాస్త్రవేత్తలు తరచూ పంటలను పరిశీలించి సలహాలు ఇస్తున్నారు.
-సుధాకర్, రైతు, వెంగారెడ్డికండ్రిగ

పడిగాపుల నుంచి విముక్తి



గత ప్రభుత్వ హయాంలో పచ్చిరొట్ట విత్తనాల కోసం ముందుగా టోకెన్లు తీసుకుని మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద క్యూలలో నిలబడి విత్తనాలు తీసుకునేవాళ్లం. కొన్ని సందర్భాల్లో ఆ పరిస్థితుల వల్ల సీజన్ కూడా దాటిపోయేది. అయితే ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రైతు భరోసా కేంద్రాల వల్ల గ్రామస్థాయిలోనే అన్నీ సకాలంలో పొందుతున్నాం. -వినోద్, రైతు, పెద్ద పాండూరు

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం



రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తోంది. గతంలో రైతులు వారి సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి పరుగులు తీసేవాళ్లు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రామసభలను ఏర్పాటు చేసి వ్యవసాయ పథకాలను రైతులకు వివరిస్తున్నాం.
-సుహర్‌లత, మండల వ్యవసాయశాఖ అధికారిణి

నేడు మండల సమావేశం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండల సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తరుణాక్షి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు..

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో బుధవారం తిరుపతి మాధురి రెమిడీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ మోహనప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కీళ్లు, ఎముకలు, కిడ్నీ, వెన్నెముక, దంతాలు, మోకాళ్ల నొప్పులు, సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు చేస్తారని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన నాయకులు

శ్రీకాళహస్తి: మండలంలోని అక్కుర్తి దళితవాడకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సింగమాల సుబ్బరామయ్య కుమారుడు సురేష్(30) క్యాన్సర్ వ్యాధితో మంగళవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.10వేలను నాయకుల ద్వారా మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో తాటిపర్తి శంకర్‌రెడ్డి, మల్లం కృష్ణయ్య, తోటి ప్రభాకర్, వెంపల్ల సురేంద్రయాదవ్, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దినకర తేజా... గోవిందా..!



సూర్యప్రభ వాహనంలో కల్యాణ వెంకటేశ్వరుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం వెలుగును నింపే దినకరుడిని, రాత్రి చల్లని వెలుగుతో నింపే చంద్రుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. దీప ధూప నైవేద్యాలను సమర్పించారు. 8.30 గంటలకు సూర్యప్రభ వాహనాన్ని విశ్వరూప దర్శనధారిగా శ్రీవారు అధిష్టించి పురవీధుల్లో ఊరేగారు. వీధుల్లో మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం బాల గోపాలునిగా స్వామి వారు ఉయ్యాలసేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించిన ఉత్సవమూర్తులు ఊరేగింపుగా బయలుదేరారు. ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు స్వామి వారి రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సాయంత్రం అశ్వవాహన సేవ అనంతరం రాత్రి 7 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవంలో దంపతులు వెయ్యి రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న

ఎంపీడీఓగా నరసింహారావు



బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డీవీ నరసింహారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్‌నాయుడు ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో ఏటిగా పనిచేస్తున్న త్రివిక్రమ్‌రావు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై డీవీ నరసింహారావు వచ్చారు. మండలంలోని అభివృద్ధిపై దృష్టి సారించి, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు

శ్రీకాళహస్తి: చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని న్యాయవాది అరుణ్ హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాంతి నగర్‌లోని నివాస గృహాల వద్ద అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను పనులకు పంపరాదని, వారిని స్కూళ్లలో చేర్పించి భవితకు బాటలు వేయాలన్నారు. ఇక న్యాయపరమైన సమస్యలు ఏవైనా ఉంటే 15100 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తితో పనిచేయండి



జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఆదిమూలం

- విద్యాకానుక పరిశీలనలో టీచర్లకు ఎమ్మెల్యే సూచన

వరదయ్యపాళెం: దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కిందని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో 8 రకాల వస్తువుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడులు తెరిచే రోజే విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న జగనన్న స్ఫూర్తితో ఉపాధ్యాయులు నిబద్ధతతో పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. అలాగే వరదయ్యపాళెం హైస్కూల్ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు.

ఆరు బాలికల జూనియర్ కళాశాలలను మంజూరు చేయించా

నియోజకవర్గంలోని 6 మండలాలకు ఒకేసారి హైస్కూల్ ప్లస్ బాలికా జూనియర్ కళాశాలలను ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో మంజూరు చేయించానని ఎమ్మెల్యే అన్నారు. ఈ ఏడాది నుంచి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం మండల కేంద్రాల్లోని హైస్కూళ్లలో బాలికా జూనియర్ కళాశాలలుగా అందుబాటులోకి వస్తాయన్నారు. పది పాసైన ఆయా పాఠశాల విద్యార్థినులు ఇంటర్మీడియెట్‌లో అక్కడే చేరాలని కోరారు. గోవర్ధనపురానికి చెందిన గుత్తి భాగ్యలక్ష్మి డాక్టర్ ఆఫ్ ఫార్మసీలో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించడంతో ఆ విద్యార్థినిని ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరిశంకరరావు, ఎంఈఓ సరస్వతి, ప్రధానోపాధ్యాయులు మోహన్‌బాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంట గంగమ్మకు సారె సమర్పణ

తిరుపతి రూరల్: తుమ్మలగుంట చెంచువారికాలనీ జాతర సందర్భంగా చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. మంగళవారం తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి చెంచువారికాలనీకి ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ పాల్గొన్నారు.

బీజీఆర్ కాలనీకి పక్కా గృహాలు ఇవ్వరూ!



బీజీఆర్‌కాలనీలో గిరిజన మహిళలకు బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- సత్యవేడు ఎమ్మెల్యేకు గిరిజనుల వినతి

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని బీజీఆర్ కాలనీకి అన్ని మౌలిక వసతులు, పక్కా ఇళ్లు, పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ కాలనీ గిరిజనులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కోరారు. మంగళవారం బీజీఆర్‌కాలనీ, అనిల్ సెంటర్, గోవర్ధనపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 327 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ లబ్ధి బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ముంపు ప్రాంతంలో ఉన్న తమ కాలనీకి వరదనీరు రానివ్వకుండా కట్ట వేయించాలని, వీధులకు సిమెంటు రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి పక్కా ఇళ్లు మంజూరు చేయించాలని బీజీఆర్ గిరిజనకాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ముంపు ప్రాంతవాసులకు మరోచోట ఇళ్లు మంజూరు చేసి కట్టిస్తామని ఎమ్మెల్యే స్పందించినా తాము ఇక్కడే ఉంటామని కాలనీ వాసులు చెప్పడంతో విడతల వారీగా కాలనీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనిల్ గిరిజనకాలనీలో కూడా వర్షాల సమయంలో ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని, వీధులకు మట్టిని నింపి ఎత్తు చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ ఈఓను ఎమ్మెల్యే ఆదేశించారు. గోవర్ధనపురంలో పూర్తిస్థాయిలో మురుగు కాలువలు నిర్మించాలని, ప్రతి ఏటా వర్షాకాలంలోఇళ్లలోకి వర్షపునీరు చేరి మగ్గపు గుంతలు వర్షపు నీటితో నిండిపోతుండడంతో మూడు నెలలు ఉపాధి కోల్పోతున్నామని చేనేత కార్మికులు తమ సమస్యలు నివేదించారు. అలాగే లోఓల్టేజీ సమస్యను ప్రస్తావించారు. వీలైనంత త్వరగా మురుగు కాలువలు నిర్మించేందుకు చొరవ చూపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గోవర్ధనపురం తూర్పు వీధిలో రూ. 5లక్షలతో సిమెంటు రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని హామీలిచ్చారు..ఎలా మోసం చేశారనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారన్నారు. అనంతరం గోవర్ధనపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచ్ జ్యోతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీరస్వామి, సునీల్, బుజ్జమ్మ, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరిశంకరరావు, పంచాయతీ ఈఓ బసిరెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.